# చిగిర్చిన విధుర జీవితం

పెనుమర్తి కామేశ్వరరావు

(క్రిందటి సంచిక తరువాయి)

ఒకచోట ఆవరణలో నున్న స్త్రీ పురుషులు ఒకరికొకరు కన్పించకుండా వుండడం అసంభవం. కమల వచ్చిన మొదటి నెలలో వెంకట్రావుకు రెండుసార్లు మాత్రం కన్పించింది. కాని కమలకు అతను రోజూ కన్పిస్తూండేవాడు. అతను అందరికీ ఉమ్మడిగావున్న బావి వద్ద స్నానం చేయడానికి వచ్చినప్పుడు కమల అతన్ని కిటికీలోంచి ఒకసారి చూచి గదిలోకి వెళ్ళి దాక్కొనేది! వెంకట్రావు స్నానం చేస్తున్నంతసేపూ కమల ముఖం ఎక్కడైనా కన్పిస్తుందేమోనని నిరీక్షించేవాడు. కాని ప్రయోజనం ఉండేది కాదు. రెండు సార్లు ఆమె సినిమా చూడడానికి తల్లితో వెళ్తూండగా మాత్రం వెంకట్రావామెను నేత్రోత్సాహంగా చూడగలిగాడు. మొత్తంమీద వెంకట్రావామెను చూడాలని కాంక్షించేవాడు. కారణం - ఎంత నిగ్రహము కలిగి యుండినా, అతని హృదయాంతరంలో సౌందర్యోపాసనయథాప్రకారంగా చిగిరిస్తోంది.

కమల కూతురు ఉష నడుస్తుంది. కొన్ని మాటలు మాట్లాడుతుంది. ఆ పిల్ల చాలాసార్లు భయంలేకుండా వెంకట్రావు గదిలోకి వచ్చి కూర్చొని, గోడలకున్న చిత్రపటాలను తిలకించేది. తనకు సంతానం లభించే అదృష్టం లేదు. అది మానవ వంచన వలన దూరమై పోయింది. దైవం తనపట్ల దయార్ద్ర హృదయుడవటం వల్లనే, తన కష్టాలలో నుంచి తాను తేరుకొని, లేని ఆనందాన్ని తెచ్చుకొని జీవిస్తున్నాడు.

ఉషను వెంకట్రావు ఒకటి రెండుసార్లు ఎత్తుకుని ముద్దెట్టుకుని గోడల్ని వున్న ఫోటోలు ఒక్కొక్కటే ఆ చిన్న కళాపిపాసికి చూపించాడు. ఆమెకు చాక్లెట్టు కొనిపెట్టేవాడు. అందువల్ల ఆపిల్ల ప్రతిదినం వెంకట్రావు గదిలో వచ్చి కూర్చునేది. అతని ఏకాంతంలో అతనికి ఉష చాలా కాలక్షేపంగా వుంటూండి.

ప్రతి దినమూ తన కుమార్తె వెంకట్రావు గదిలో ప్రవేశించడం కనులకు తెలియని విషయం కాదు. కమల కుమార్తెను అన్నానికి, నీళ్లు పోసుకోవడానికి పిలుచుకపోవలసి వచ్చేది. ఒకనాటి ఉదయం తొమ్మిది గంటల వేళ ఉషని తన ఒడిలో కూర్చోపెట్టుకొని వెంకట్రావు ఆ పిల్లకు మాటలు నేర్పుతున్నాడు. "తాత, మామ, అమ్మమ్మ, అన్నయ్యా, అక్కయ్యా" అని మాటలు చెబుతూంటే ఆమూడేళ్ళపిల్ల చక్కగా పలుకుతోంది, చాకలెట్లు చప్పరిస్తూ. అదే సమయంలో కమల వాకిట్లో నిలబడి "ఉషా, రా, తలంటి పోసుకుందువుగాని" అని పిల్చింది.

వెంకట్రావు తల ఎత్తి ఆమెని తిలకించి ఉషతో "పో, మీఅమ్మ నీకు తలంటి పోస్తుందిట!" అన్నాడు ఉషతో.

ఉష పోనని తెలియబరిచే "ఊహూ" శబ్దం పలికి-నవ్వుతూ అతన్ని చూచింది. కమల "తలంటి పోసుకోవూ?" అని లోపలికి వచ్చి వెంకట్రావు వద్దనున్న కూతుర్ని రెక్కపట్టుకుని గబగబా యీడ్చుకపోయింది. ఉష శోకించసాగింది. వెంకట్రావుకు కమల కుమార్తె వీపు మీద రెండు దెబ్బలు చరవడం. ఆ దెబ్బలతో ఉష కంఠస్వరం పెద్దదిచేసి ఏడవటం వినిపించాయి.

"బాగా చాకలెట్లు తినమరిగి తలంటూ ఏమీ అక్కరలేకుండా తాతగారి దగ్గర కూచుంటావూ?" అన్నది కమల. ఆ మాటలు వెంకట్రావుకు వినిపించేలాగున బిగ్గరగానే అన్నది కమల. తను ఉషకి తాతని తెలుసుకుని వెంకట్రావు నిర్విణ్ణుడైనాడు! తను కమలకి తండ్రితో సమానం! అవును! ఆమె అభిప్రాయం సరి

యైనదేనని వెంకట్రావు గ్రహించాడు. దినదినం తానెంత అలంకరించుకొని అందంగా కనిపించడానికి ప్రయత్నిస్తున్నా తన క కాలంలో ప్రాప్తించిన భార్యావియోగ కారణంగా తనకు తెలియని వృద్ధాప్యం కమలకు కనిపించి వుంటుంది. లేక ఆమె శీల రక్షణకామాట కవచమై రాణించగలదేమో? తను ఉషకు తాతగారట! వెంకట్రావు హృదిలో ఆదివారంనాడు చర్చిలో మ్రోగే గంటలాగున "తాత" శబ్దం ఆ రోజల్లా వినిపించసాగింది. నిద్ర పట్టక ఆ ఉదయం దృశ్యమే కమలయెదుట సాక్షాత్కరించింది. ఎన్నడూ తన ఎదుటికిరాని కమల కూతుర్ని తీసికెళ్ళడానికివచ్చి, తనమీద ఒక చేతి బాంబు విసిరినట్లుగా తనను తాతని చేసింది. ఏ కారణం వల్ల ఆమెకలా తోచిందో అతని మనసుకు తట్టక ఆలోచన పలువిధాల పోయింది. ఆలోచన ప్రవాహం వంటిది! ఆ ప్రవాహం పృథగ్విధ మార్గాలు పట్టడం సహజం. కమల భర్త గతించి పుట్టింటికి చేరిన తరువాత తాను ఆమె సౌందర్యానికి మోహితుడై ఆమెను ప్రేమించి ఆమెకోసం వెంపరలాడలేదు. కనీసం ఆమె స్నేహంకోసం ఏదో పని కల్పించుకుని వాళ్ళ యింట్లోకి పోయి సంభాషించలేదు! ప్రతి మాసమూ ఒకటవ తేదీ రాగానే, తానివ్వవలసిన అద్దె తాలూకు డబ్బు తీసికెళ్ళి ఆమె తండ్రిని పిలిచి యివ్వడం తప్పితే, అతనింకేమీ ప్రమేయం ఆ కుటుంబంతో పెట్టుకొనక పోవడమే తన లోపమా? విదేశాలలో స్త్రీ పురుషుల కున్న సౌకర్యాలు యీ దేశంలో లేక పోగా ఒకరినొకరు అర్థం చేసుకోడానికికూడా ప్రయత్నించరు. పురుషులు తమ కీర్తి మర్యాదల్ని లెక్కచేయకుండా అబలలు, పతివ్రతలు అని కీర్తి గడించిన స్త్రీల ప్రణయంకోసం పాటుపడుతూండడం సర్వ సామాన్య విషయం ఈ దేశంలో. అంతేకాని విదేశాలలోవలె స్త్రీలీదేశంలో స్వేచ్ఛతో పురుషుల్ని ప్రేమించడం మానసికంగానే తప్ప వేరువిధం గాదు. అందువల్ల సౌందర్యవతియగు కమల తనను వెంకట్రావు నిర్లక్ష్యంగా చూస్తున్నాడనుకొన్నదేమోనని వెంకట్రావుకు అనుమానం కూడా కలిగింది! ప్రజలలో చాలామందివలె అతనికి సాహసం తక్కువ. కీర్తి ప్రతిష్ఠలు భంగమవుతాయేమోనన్న భయమెక్కువ.

ఆ ఉదయం కమల కుమార్తెకు తలంటిపోసి తల దువ్వి, సిల్కు గౌనుతొడిగి, పౌడరద్ది, చంకనెత్తుకుని వెంకట్రావు గదివాకిట్లోంచి, "ఇదిగో మీ మనమరాలు!" అన్నది నూటిగా.

వెంకట్రావు "ఉషా సుందరీ! రా, రా, రా" అని పిలిచాడు ఉషని, కమలని తిలకిస్తూ.

"మీవద్ద తెలుగు నవలలేమైనా ఉన్నాయండీ?" అన్నది కమల.

"ఆఁ, నారాయణరావు వుంది. ఇమ్మంటారా?" అని లేచి అలమరలోనుండి ఆ పుస్తకం తీసి దానిని కమలచేతి కిచ్చాడు, ఆమె శరీర కాంతి కచ్చెరువందుతూ.

కమల ఆ పుస్తకాన్ని తీసుకొని ఇంట్లోకి వెళ్ళిపోయింది. ఉష వెంకట్రావు దగ్గరికివచ్చి, ఒక బొమ్మల పుస్తకంమీద వేలుపెట్టి "తాతా! బొమ్మ" అన్నది. అంటే అందులో బొమ్మలు చూపించమని ఆ అమ్మాయి ఉద్దేశ్యం. వెంకట్రావు ఆ పిల్లకు బొమ్మలు చూపిస్తూ ముద్దెట్టుకుని, ఆ బొమ్మల్ని చూచి ఆ బాలిక పొందే ఆనందాన్ని గమనించసాగాడు.

ఇంతలో అతని మిత్రుడు పద్మనాభం వచ్చాడు.

"ఏం వెంకట్రావ్! ఈ అమ్మాయి ఎవరు? నీ కూతురా?" అని ప్రశ్నించాడు.

పద్మనాభానికి వెంకట్రావు ఏకాంత జీవితం గూర్చి తెలిసే అలా అడిగాడు.

"ఆ. నా పెంపుడు కూతురు." అన్నాడు. వెంకట్రావు.

"అంటే...?" అని సాగతీశాడు పద్మనాభం.

"అంటే ఏమీలేదు. నా పెంపుడుకూతురే" అన్నాడు వెంకట్రావు.

"మరీ పిల్లను నువ్వే పెంచుతున్నావా? నిజం చెప్పవోయ్ ప్రభూ!" అన్నాడు పద్మనాభం.

"ఈ అమ్మాయి ఈ యింటి యజమానిగారి మనమరాలు!" అన్నాడు వెంకట్రావు.

"అంటే కమల కూతురా? కమలకు భర్త గతించాడుకదూ?" అన్నాడు పద్మనాభం.

"అవును. ఆ విషయం తెలిసికూడా నన్ను

ప్రశ్నించడంలో నీ ఉద్దేశ్యమేమిటి?" అన్నాడు వెంకట్రావు కొంచెం ఉద్రేకంగా.

"అఁ, ఏం లేదు. వాసుదేవరావు ఏమన్నాడో తెలుసునా? ఇంటివా రమ్మాయికి భర్త గతించడంవల్ల వెంకట్రావు సమస్య పరిష్కారమైంది అన్నాడు."

"వాడు పరమనీచుడు! నీవు వాడిమాటను నమ్మితే, నీవీ నాటినుంచీ నావద్దకు రా నవసరంలేదు." అన్నాడు వెంకట్రావు.

పద్మనాభానికి కోపం వచ్చింది. వెళ్ళడానికి లేచి నిలబడి "ఉన్నమాటంటే ఎవడికైనా ఉక్రోషమే. నీ యింటికి రాకపోతే నాకు జరగదనా నీ ఉద్దేశ్యం? ఊళ్ళో నిన్ను గూర్చి ఏం చెప్పుకుంటున్నారో నీకు తెలిసికూడా తెలియనట్లుగా నటిస్తున్నావు. నీ వదృష్టవంతుడివి. సెలవు" అని వీథిలోకి వెళ్ళాడు.

వెంకట్రావుకూడా వెంట వెళ్ళి "పద్మనాభం! నీ వింత ఫూల్ వనుకోలేదు. ఆ వాసుదేవరావు ఒక్కడే ఫూల్ అనుకున్నాను!" అన్నాడు.

పద్మనాభం "షటప్ యూ స్కౌండ్రెల్" అన్నాడు రోడ్డుమీద నిలబడి. వెంకట్రావు కూడా రోడ్డుమీదకి వస్తాడనుకున్నాడు పద్మనాభం. తన ప్రతిష్ఠను భంగపరిచేటందుకిదొక ప్లానని వెంకట్రావు మనసుకు స్ఫురించి వెంటనే తలుపులుమూసి గడియ వేసుకున్నాడు. కాని పద్మనాభం వీథిలోనుంచి పిచ్చిపిచ్చి మాటలేవో మాట్లాడుతుండగా ఆ యింటి యజమాని సుబ్బరామయ్య యింటికి వచ్చాడు. పద్మనాభం మాట్లాడిన మాటలు కొన్నిమాత్రం విని లోనికి వెళ్లాడు. ఆయన దూరంనుంచి చూచాడు వెంకట్రావు వాకిట్లో నిలబడి పద్మనాభాన్ని ఏదో అనడం.

ఓ పదినిముషాలయిన పిమ్మట సుబ్బరామయ్య వెంకట్రావువద్దకు వచ్చాడు. తన మనుమరాలు ఉష వెంకట్రావుదగ్గర కూర్చొని వుండడం చూచాడు.

"ఏమండీ! ఎవరతను వీథిలో నిలబడి మీ మీద కారాలు మిరియాలు నూరుతున్నాడు?" అని ప్రశ్నించాడు.

"వాడో అమాయికుడు. ప్రతి ఒకడూ నా వద్దకువచ్చి యీ ఫొటోలు చూచి, అజ్ఞానంతో యీ ఫొటోలు బాగుండలేదనీ, నా కేమీ తెలియదనీ అనటం, నేనేమో అనేసరికి వాళ్లకు కోపంరావటం, ఇది నిత్యకృత్యమైంది. తమ కర్థం కానివన్నీ బాగుండనివన్ని వీళ్ళ అభిప్రాయం. అసలు వీళ్ళని ఎవ డాహ్వానించాడు నావద్దనున్న ఫొటోలు చూడమనీ, వీటినిగూర్చి తమ అభిప్రాయమిమ్మనీ? అంతకుమించి ఏమీ లేదు." అన్నాడు వెంకట్రావు తెలివిగా. సుబ్బరామయ్య ఆ మాటలకు తృప్తిపడి మనుమరాలి నెత్తుకుని లోపలికి తీసుక వెళ్ళాడు.

* * *

వాసుదేవరావు తన కసి తీర్చుకోవడమునకు అవకాశం దొరికినట్లుగా సంతోషించాడు. పద్మనాభం చెప్పిన మాటలు విని, ఇక ఇరువురూ క్లబ్బులో వెంకట్రావుమీద ద్వేషమున్న సభ్యులందరికీ వెంకట్రావు గూర్చి అవినీతికరంగా ప్రచారంచేయ నారంభించారు. అంతే కాదు, అతన్ని సుబ్బరామయ్య ఇంట్లోనుంచి కాళీ చేయించడానికి వలసిన మార్గాల న్వేషించ నారంభించారు. అందుకోసం ఇద్దరూ ఆ గ్రామంలో సుబ్బరామయ్య చుట్టంవద్దకు పోయారు.

"మీ సుబ్బరామయ్యకు మతిపోయినట్లుంది. పెళ్లాన్ని విడిచిపెట్టినవాడి కిల్లు అద్దెకిచ్చాడు. భర్త గతించిన కూతుర్ని పుట్టింటికి తీసుక వచ్చాడు. ఆ వెంకట్రావు ఆ కమల కూతుర్ని తన పెంపుడుకూతురని యీ పద్మనాభంతో అన్నాడుట! మీబంధువులేగా సుబ్బరామయ్య? ఆ వెంకట్రావును ఆ యింట్లోనుంచి తరిమేయించాలండీ!" అన్నాడు వాసుదేవరావు.

ఇక పద్మనాభం తను స్వయంగా చూచానని కొన్నిసంగతులు కల్పించి మాట్లాడాడు. ఈ సంగతులు రెండురోజుల అనంతరం సుబ్బరామయ్య చెవినిపడ్డాయి. సుబ్బరామయ్యకు వెంకట్రావు చాలా మంచివాడని అభిప్రాయముంది! కాని యీ ప్రచారం విన్నతరవాత అతనికి మనసులో ఆందోళన కలుగ నారంభించింది. ఆయన ఇంట్లో కమల చదువుతున్న

"నారాయణరావు" నవలను చూచాడు. దాని మీద వెంకట్రావు పేరుంది.

సుబ్బరామయ్య కూతురివద్దనున్న నవల తీసి కొని "కమలా! ఈ నవల నీవద్దకెలావచ్చింది?" అని ప్రశ్నించాడు. కమల సమాధానం చెప్పడానికి ఖంగారుపడింది.

"చదువుకోడానికి ఏదైనా పుస్తకం ఇమ్మనమని పనిమనిషిని పంపితే మన యింట్లో అద్దెకున్న వెంకట్రావుగారీ నవల యిచ్చి పంపారు. ఈ నవల చాల బాగున్నది నాన్నగారూ!" అన్నది కమల.

"ఈ వెంకట్రావు చాలా మంచివాడనుకున్నాను. ఇతని ప్రవర్తనగురించి నాకు చాలా రిపోర్టులు వచ్చినయి. ఉష ప్రొద్దు కూకులూ అతని గదిలో కూచోటం నాకేమీ బాగాలేదు. నీవు నీకూతుర్ని దగ్గరఉంచుకుని ఆడించలేవూ? నీకంత బద్ధకమయితే యెట్లా? లోకులు పలుగాకులు! వాళ్ళు ప్రతి విషయాన్నీ శంకించి అపార్థాన్ని కల్పిస్తారు. ఈ వెంకట్రావుని యిల్లు కాళీచేయమని చెబుదామనుకుంటున్నాను." అన్నాడు సుబ్బరామయ్య.

"ఆయనేం చేశాడు? ఆయనకు ఒకరి జోలీ జోక్యమూ లేదు." అన్నది వరలక్ష్మమ్మ భర్తతో. కాని సుబ్బరామయ్య తన ఆందోళన తన భార్య గ్రహించలేదని తెలుసుకున్నాడు. వెంకట్రావు వద్దకు వెళ్ళి "వెంకట్రావుగారూ, మీ రయిదేళ్ళనుంచీ మా ఇంట్లో అద్దెకుంటున్నారు. మనం ఇన్నాళ్ళూ చాలా స్నేహంగా వున్నాము. మాకు యిల్లు చాలటం లేదు. అందుచేత మీరు మాయందు దయయుంచి యిల్లు కాళీచేయవలసిందని కోరుతున్నాను. మా అమ్మాయి తాలూకు సామాను కొంత వుంది, అది పడెయ్యడానికి మీరున్న భాగం కావాలి." అన్నాడు సుబ్బరామయ్య.

"అలాగే! నెలాఖరుకు కాళీ చేస్తాను లెండి. ఈ లోపుగా మరో యిల్లు కుదుర్చుకుంటాను. ఈవూళ్ళో ఇంళ్లు దొరకడం చాలా కష్టంగావుంది. అయినా, మీ రిబ్బంది పడుతున్నారని వినడానికి నాకు కష్టంగా వుంది. తప్పకుండా ఇంకో పదిరోజులకి కాళీ చేస్తాను." అన్నాడు వెంకట్రావు.

సుబ్బరామయ్య కుమార్తెతో గట్టిగా చెప్పాడు, ఉషని వెంకట్రావు వద్దకు పోనీయ వద్దని. కాని ఆ చిన్నపిల్ల బాగా అలవాటు పడింది. అలవాటు మాన్పించడ మెవరికి సాధ్యమౌతుంది? కమల ఎన్నివిధాల ప్రయత్నించినా ఉష తల్లివద్ద వుండటంలేదు. ఇట్టే రోజులు తిరిగిపోయినయి. వెంకట్రావు ఇంకోచోట ఇల్లు కుదుర్చుకుని, తన సామానంతా బండిలో వేసి తీసుకవెళ్తూంటే, ఉష ఒకటే ఏడుపు ప్రారంభించింది. కమలకు కూడా మనసులో విచారం కలిగింది. సామానంతా బండిలో ఎక్కించి, ఒకసారి ఏడుస్తున్న ఉష నెత్తుకుని "మీ తాతయ్యను మరిచిపోకు! ఇదిగో చాకలెట్లు." అని ఒక చాకలెట్ల పొట్లం ఆమెచేతి కందించి ముద్దెట్టుకున్నాడు. ఆ మాటలు విని, ఆ చాకలెట్ల పొట్లం చూచిన కమల, వరలక్ష్మమ్మ "దానికెందుకు లెండి, చాకలెట్లు పెడితే జబ్బుచేస్తుందన్నారు డాక్టరు గారు." అన్నారు. ఆ సమయంలో సుబ్బరామయ్య ఇంటివద్ద లేడు. వెంకట్రావు "ఫరవాలేదు. చాకలెట్లు జబ్బుచేసేవి కావు. నా విరోధులు కొంతమంది నామీద విషప్రచారం ప్రారంభించి నన్ను మీ యింట్లోనుంచి కాళీ చేయించారు. ఇక్కడనుంచి పోవడమంటే నాకు చాలా విచారంగా వుంది. అందులో మీఉషని విడిచిపోవడానికి నాకు బాధగా వుంది. ఐనా తప్పదు." అన్నాడు గాద్గదికంగా.

వెంకట్రావు సామాను బండితో నడిచిపోతూంటే ఉష తల్లి చంకలో కూర్చోని "తాత, తాత!" అంటూ దుఃఖించ సాగింది. కమల పిల్లని యింట్లోకి తీసుకవెళ్ళి చాకలెట్ల పొట్లమూడదీసి ఉషకు చాకలెట్లుపెట్టి సముదాయించడానికి ప్రయత్నించినది. కాని ఉష వెంకట్రావు వున్న ఇంట్లోకి పోయి, బావురుమంటూన్న యిల్లు చూచి దుఃఖించ సాగింది. ఇలా ప్రతిదినం అలవాటు ప్రకారం ఉష ఆ యింట్లోకి పోవడం మానలేదు.

* * *

వెంకట్రావు కొత్త అద్దెయింట్లో ప్రవేశించి పదిహేనుదినాలయింది. మొదటి రెండు రోజులు కమల, ఆమెకుమార్తె ఉష, జ్ఞప్తికి

వచ్చినప్పుడల్లా అతని గుండె బరువెక్కి బాధ పడేది. కాని ఎంతబాధనైనా గతానుభవాన్ని స్మరించుకొని అతను వేదనను భరించటాని కల వాటుపడిన వాడవటంవలన మనసు మార్చుకో టానికి తరుచు సినిమా చూడసాగాడు. సినిమా లలో చిన్నపిల్లలుకనిపిస్తే అతనికి ఉష జ్ఞప్తికి వచ్చేది. ఆ పదిహేను రోజులలో పది సినిమా లకు వెళ్ళాడు. ఏ సినిమాకైనా కమల ఉషతో గూడా వస్తే ఒకసారి అయిద్దర్నీ చూద్దామని కూడా అతనికి ఆలోచన కలిగింది. కాని అతను తను వదిలివచ్చిన యింటివైపుకు మరల పోలేదు. వెళ్ళాలనికోర్కె కలిగినా, నిగ్రహించాడు.

ఒకటి రెండుసార్లు సుబ్బరామయ్య బజా రులో కనిపించాడు కాని అతనాయనను చూచి దూరంగా తొలిగిపోయాడు.

పదిహేను దినాల తరవాత ఒకనాడు సుబ్బరామయ్య కంగారుగా వెంకట్రావింటికి వచ్చి "ఏమండీ, వెంకట్రావుగారూ, మా ఉషకు చాలా జబ్బుచేసింది. మీకోసం దిగులు పెట్టుకుందని మా వాళ్ళంటున్నారు. తాత, తాతని కలవరించడం, నేనూ తాతనే కదా అని దగ్గరకిపోతే, నన్ను చూడక ఏడుస్తు న్నది. మీరొకసారి వచ్చి ఉషని చూచి పోవాలి. మీ పుస్తకం "నారాయణరావు" కూడా మా యింట్లోనే వుంది. అది తీసుకుం దురుగాని, ఒకసారి నావెంట రావాలి." అన్నాడు.

వెంకట్రావొక నిముషం ఆలోచించి "చిన్న పిల్ల! నేకూడా ఆ పిల్ల నన్ను గూర్చి దిగులు పెట్టుకుందేమో నని మనసులో భయ పడ్డాను. నిజంగా అలాగే జరిగింది. పదండి పోదాం!"అని చొక్కా ధరించి సుబ్బ రామయ్య వెంట బయల్దేరాడు. ఉష చిక్కి పోయి మంచాన అంటుకొని వుంది. కమల కూడా కూతురి జబ్బువల్ల ఆందోళనతో చాలా నీరసంగా కన్పిస్తోంది. వెంకట్రావుని చూడ గానే ఆమె మంచంలోనుంచి లేచి వెళ్ళి దూరంగా నిలబడింది. వెంకట్రావు మంచంలో కూర్చొని-"ఉషా సుందరీ! ఇటు చూడు. నేను వచ్చాను. నీకు చాకలెట్లు-బొమ్మలు తెచ్చాను" అన్నాడు ఆమె ఒంటిమీద చేయివేసి.

ఉష నీరసంగా కళ్ళు విప్పి వెంకట్రావుని చూచి ఒక చిన్న చిరునవ్వు నవ్వింది. తన బుల్లి చేయితో అతని చొక్కా పట్టుకుంది. అతను ఉషని లేవదీసి ఎత్తుకుని "నా కోసం దిగులు పెట్టుకున్నావా, పిచ్చిపిల్లా! ఈ ప్రపం చంలో నే నందరికీ అయిష్టుణ్ణే కాని - నీ కొక్కర్తెకూ నా మీద యింత ప్రేమ వుందా తల్లీ! నీకు జ్వరం నయమవుతుంది. నే రోజూ రెండుపూటలా వచ్చి నీవద్ద కూచుంటాను. నీవేం దిగులు పడకు. చూడు, మీ అమ్మ నీకోసం బెంగ పెట్టుకుని ఎలా అయిపోయిందో! ఏం కమలా? నీ ఆరోగ్యం కూడా సరిగా లేదల్లే వుంది!" అన్నాడు. ఎంతో కాలానికి అతను కమలతో ధైర్యంగా మాట్లాడ గలిగాడు.

"అవునండీ! నా పంచప్రాణాలు నా ఉషా సుందరి. దానిని మీదానినిగా చేసుకుని ఇల్లు కాళీచేసి పోయారు. మీరు వెళ్ళింది మొదలు అది ఎన్నిసార్లు మీ గదిలోకి వెళ్ళి మిమ్మల్ని వెతికిందో నేచెప్పలేను. రోజూవచ్చి కాసేపు దానినాడించి మళ్ళీ నా కూతుర్ని బ్రతికించండి. మీ మేలు మేము మరచిపోము" అన్నది కమల కంటి కొలకులనుండి కన్నీరు కారుస్తూ.

"ఉష నా పెంపుడు కుమార్తె అని నే ననుకున్నాను. నిజం కూడా అంతే. దానికి నా సర్వస్వం ఇచ్చేద్దామని నిశ్చయించు కున్నాను. నేనా పిల్లకు బి. యే. దాకా చదువుచెప్పించి తగిన వరుడికిచ్చి పెళ్ళి చేద్దా మని కలలు కన్నాను. కాని యీ సంఘం, యీలోకం ఎంతక్రూరమయిందో నాకు తెలుసు. నా నిష్కల్మషత నర్థం చేసుకునే వ్యక్తులే కన్పించడంలేదీ లోకంలో." అన్నాడు వెంక ట్రావు.

ఆనాటి నుంచి ఉష జబ్బు తగ్గుదలకు వచ్చింది. ప్రతిదినం ఉదయ సాయంత్రాలు వెంకట్రావు ఉషని చూడడానికి వెళ్తున్నాడు.

ఒకనాడు సుబ్బరామయ్య "వెంకట్రావు గారూ, మీరెంత మంచివారో నాకు తెలిసి కూడా ఇతరులు మిమ్మల్నిగూర్చి చెప్పిన విష యాలు విని, ఇతరులకోసం నేను మిమ్మల్ని ఇల్లు కాళీచేయమని చెప్పాను. నిజంగా మీరు వెళ్ళిపోవటం మనసులో నా కిష్టంలేదు. మీరు

ఫష్టు తారీకునాటికి మళ్ళీ మీ భాగంలో ప్రవేశిస్తే నాకేమీ అభ్యంతరంలేదు. మీ ఉషా సుందరి ఉద్దేశ్యంకూడా అదే. ఆపిల్లకు నిజంగా తాతగారు మీరేగాని నేనుకాదు. ఆ విషయం దాని జబ్బులో రుజువైంది" అన్నాడు. వెంకట్రావు ఉష పక్కలో కూర్చొని, "ఉషా! మీ తాతగారు నన్ను మళ్ళీ మీ యింట్లో చేరమంటున్నాడు. ఏవేమంటావు?" అని ప్రశ్నించాడు.

ఉష,"రా తాతయ్యా!" అంది. ఆమాటలు విని వరలక్ష్మమ్మ, కమల నవ్వి ఆనందబాష్పాలు విడిచారు.

"నా జీవితమంతా స్వప్నతుల్యమైంది. నాకు ఉషా సుందరిని చూచిన క్షణంనుంచీ ధైర్యం ఉత్సాహం కలిగాయి. నేను నా జీవితమామె ఉన్నతికోసం ధారపోయ నిశ్చయించుకున్నాను. నేనిక్కడనుంచి వెళ్ళిపోయానన్నమాటేగాని ప్రతిక్షణం ఆమె ముద్దు పలుకులు ఆమె నవ్వుపువ్వులు, ఆమె చిన్నారిచూపులూ, చేష్టలు జ్ఞప్తికి వచ్చి, ఆమెకూ, నాకూ జన్మాంతర సంబంధమేదో వుందని ఆందోళనతో కుందుతూనే ఉన్నాను" అన్నాడు వెంకట్రావు.

వాసుదేవరావు, పద్మనాభం, తదితర అకారణ శత్రువులాశ్చర్యమందేవిధంగా మళ్లీ వెంకట్రావు తన స్వంతంగా అయిదేళ్ళనుంచీ వుంటున్న భాగంలో ప్రవేశించడమే గాక, ఉషా సుందరిని వెంటబెట్టుకుని బహిరంగంగా కాఫీ హోటలుకు వస్తూన్నాడు. అతనిలో పిరికితనము పటాపంచలైంది. అతనిలో నిష్కల్మషతను రుజువుచేసుకొనడానికి అతను సంఘం ముందు ధైర్యంతో నిలబడినాడు. పాతస్నేహితులెవరైనా ఎదురై "ఎవరీ అమ్మాయి?" అని ప్రశ్నిస్తే, "నా పెంపుడు కూతురు.ఉషాసుందరి ఈమెపేరు. ఈమె భరత నాట్యం నేర్చుకుంటుంది. బి. యే. దాకా చదువుకుంటుంది. నా ఆస్తికంతకూ హక్కుదారురాలు నా ఉషా సుందరే." అని సమాధానం చెబుతాడు.

స్కెచ్

# కుర్రవాడి ఏడుపు కారణం

బులుసు-జీ-ప్రకాశ్

బజార్లో కెవ్వు కెవ్వుమని కుర్రాడొకడి ఏడ్పు. ఎవరి తాలూకువాడో ఎవరికీ తెలియదు. వెక్కి వెక్కి రోదిస్తున్నాడు.

"నీకేం కావాలి బాబూ!" అని బుజ్జగించి అడిగాడొకాయన.

"చెప్పు నాయనా, ఏడుస్తావెందుకు?"

"మీ నాన్న కావాలి కదూ?"

"మీ నాన్నెవరు?

"మీ ఇల్లెక్కడుంది?" ఒక్కొక్కడే అడిగేస్తున్నారు, వాడికొక్కవల్సింది మాచెడ్డ ఇచ్చి పడిపోయేటట్లు. కాని కుర్రాడు మాట్లాడకుండా వున్నాడు. ఉలకడు. పలకడు. కొందరు పిప్పర్‌మెంట్ బిళ్ళలు, కొందరు చాక్‌లెట్లు, మరికొందరు స్ప్రింగు బిళ్ళలు ఎవరికి తోచింది వాళ్ళు తీసుకొచ్చి యిస్తున్నారు. అవన్నీ పుచ్చుకోలేదు పాపం ఆ నిసుగు. అయినా చుట్టూ వున్నవాళ్ళు బలవంతాన కూరేశారు జేబులో.ఒకాయన కుర్రాణ్ణెత్తుకుని—"అయ్యలారా! ఈ కుర్రాడు మాట్లాడకుండా వున్నాడు. ఇతని తండ్రి గానీ, మరే యితర బంధువులుగానీ ఇక్కడున్నట్లయితే తీసుకోమని ప్రార్థన" అని తన ప్రాణకొద్దీ అరిచాడు. లాభం లేకపోయింది.

ఒకాయన నిమ్మతొన తీసుకొనమని నిర్బంధిస్తే తిన్నాడుకాడు. అంచేత ఆ మహాశయుడు గొప్ప టక్కువేశాడు. కుర్రాడు ఏడుద్దామని నోరెత్తేసరికల్లా నోట్లో పడేశాడా తొన. కుర్రాడు ఏడుపు ఒక్క నిమిషం ఆపి 'థూ" అని ఉమ్మగా, అది ఒకాయన వెళిపోదామని వెను దిరిగేసరికి, అతని చొక్కా పైపడి అంటు